క్లుప్తంగా

అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు

● జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: మండలంలో పలు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వీటిపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పలు శాఖల అధికారులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా, ఎంఈఓ లీలారాణి, ఎంపీడీఓ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన



శాంతిపురం: రాళ్లబూదుగూరు ఎగువ వీధిలో నిర్మించిన ఊరి గంగమాంబ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహాన్ని పీఠంపై ఏర్పాటు చేసి ప్రాణ ప్రతిష్ఠ, నాడీ సంధానం చేశారు. ప్రతిష్ఠాపన హోమాలు, అభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి, పూర్ణాహుతితో దైవ కార్యక్రమాన్ని ముగించారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాలను అందజేశారు.

అంకిత భావంతో పనిచేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంపీపీ

సోమల: సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పాదలగుంటపల్లె సచివాలయాన్ని , ఎంపీడీఓ నాగరాజతో కలిసి ఎంపీపీ తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అందేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి నీరు సరఫరా చేయడానికి పైపులైన్ పనుల కోసం స్థల సేకరణను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాం, ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): డెంగీ, మలేరియా జ్వరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్లూరు హైస్కూలు విద్యార్థులతో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. జ్వరం, జలుబు, తలనొప్పితో బాధ పడుతుంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లను సంప్రదించాలన్నారు. హెచ్ఎం శ్రీవాణి, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకే విత్తనాల విక్రయం



విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ సుధారాణి

రొంపిచెర్ల: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. ఆమె శుక్రవారం రొంపిచెర్లలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల వద్ద ధరల పట్టిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి వికసిత్ భారత సంకల్పయాత్ర

సోమల: మండలంలో శనివారం నుంచి వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ నాగరాజ శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీలలో నిర్వహించే కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొనాలని, ఈ కార్యక్రమం ఈ నెల 14 వరకు కొనసాగుతుందని చెప్పారు.

నవరత్నాలతోనే అభివృద్ధి



పెద్దపంజాణి : కార్యక్రమానికి హాజరైన ప్రజలు



పెద్దపంజాణి : పార్టీ జెండా ఆవిష్కరణ

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాల అమలుతో అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూర్చారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్.పేటలోని సచివాలయంలో చైర్మన్, మండలంలోని వనమలదిన్నెలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులలో పార్టీ జెండాలు ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పరిపాలనపై ప్రజాభిప్రాయం సేకరించి మాట్లాడారు. ప్రగతికి సంబంధించిన వివరాల డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు రేష్మా, భారతి, కిజర్‌ఖాన్, పార్టీ అధ్యక్షుడు జయరాం, నాయకులు ఆవుల అమరేంద్ర, రమణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మునస్వామి, ఎంపీటీసీ సూరప్ప, నాయకులు వినయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించడానికే వై ఏపీ నీడ్స్ జగన్ ప్రత్యేక కార్యక్రమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. మండలంలోని రాయలపేట, కమ్మపాళ్యం, కోగిలేరు సచివాలయాల వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని ఎంపీపీ రెడ్డెప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల డిస్ ప్లే బోర్డు, పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలంతా సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, ఎంపీటీసీ సరస్వతి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, సర్పంచులు అరుణ, రమేష్ బాబు, రవికుమార్, పార్టీ నాయకులు మునిరాజ, మంజునాథరెడ్డి, హేమచంద్ర, శ్రీరాములు రెడ్డి, మునిఆచారి, ఇమాంవల్లి, గృహసారథులు, కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



పుంగనూరు: బుక్‌లెట్లతో ప్రచారం చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా



పుంగనూరు: వనమలదిన్నెలో పార్టీ జెండా ఎగురవేస్తున్న అమరనాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

పసుపత్తూరులో..

గంగవరం: మండలంలోని పసుపత్తూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నాయకులు, సచివాలయ ఉద్యోగులు నిర్వహించారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యక్ష, పరోక్ష పథకాలతో ప్రజలు పొందిన లబ్ధి, అభివృద్ధి వివరాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం మొత్తం రూ. 20.91 కోట్లను వ్యయం చేసిందన్నారు.

భరత్‌ను ఆదరిస్తే అండగా ఉంటాం



గుడుపల్లె : శివమ్మకు నగదు ఇస్తున్న పద్మమ్మ



కుప్పం : మహిళలకు సారె పంపిణీ చేస్తున్న దుర్గ

గుడుపల్లె: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్‌ను వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఆదరిస్తే ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని ఆయన తల్లి పద్మమ్మ పునరుద్ఘాటించారు. శుక్రవారం మండలంలోని కొడతనపల్లె, ఆవులతిమ్మనపల్లె, సొలచింతనపల్లె, గుడిచెంబగిరి గ్రామాలలో ఆమె పర్యటించారు. ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గం అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి, విరివిగా నిధులు మంజూరు చేశారన్నారు. ఒకసారి అవకాశం ఇస్తే శాశ్వత అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఇదలా ఉంచితే, వర్షానికి తమ ఇల్లు ఉరుస్తోందని ఆవులతిమ్మనపల్లెకు చెందిన శివమ్మ ఆమె దృష్టికి తేవడంతో స్పందించారు. ఇంటి మరమ్మతులకు రూ.10వేలను అందజేశారు.

మా ఆయనను ఆశీర్వదించండి

కుప్పం: ఎమ్మెల్సీ భరత్‌ను ఈసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపుతారని ఆయన సతీమణి దుర్గ అన్నారు. శుక్రవారం స్థానిక 8 వార్డు చీలేపల్లె, పరమసముద్రం, పై ఊరు, వడ్డిండ్లు గ్రామాల్లో 'జగన్‌తో జనం–భరత్‌తో మనం' కార్యక్రమం ఆమె నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. మహిళలకు సారె పంపిణీ చేశారు. భరత్‌ను అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు.



వృద్ధుడి సమస్యలు ఆలకిస్తున్న దుర్గ

రాజీమార్గమే ఉత్తమం

● పంతాలు, పట్టింపులొద్దు

● సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

పలమనేరు: అనవసరమైన పంతాలు, పట్టింపులతో కక్షిదారులు కాలం, ధనం వృధా చేసుకోరాదని, కేసులను రాజీ చేసుకుని మనశ్శాంతిగా జీవించాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక కోర్టులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ సమీపంలోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని, చెక్ బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పుపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. దీనికి తోడు రాజీ అయిన వారికి కోర్టుకు చెల్లించిన ఫీజును కూడా వాపస్ చేస్తామన్నారు. కేసులను రాజీ చేసేందుకు స్థానిక కోర్టులోని పలువురు న్యాయవాదులతో ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్‌ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలసి నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పార్టీ నాయకుడు

కుప్పం రూరల్: కుప్పం మండలం కృష్ణదాసనపల్లె పంచాయతీ గంగాపురానికి చెందిన వార్డు సభ్యురాలు నారాయణమ్మ(35) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ ఆమె అంత్యక్రియలకు రూ.10వేలను ఆర్థిక సాయం చేశారు. స్థానిక నాయకుడు నారాయణప్రసాద్ ఈ సొమ్మును శుక్రవారం మృతురాలి భర్త నరసింహకు అందజేశారు.

అరగొండ హైస్కూల్ తనిఖీ

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లను, అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ప్రజాప్రతినిధులతో కలసి మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఓటర్ల నమోదుపై తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదుకు వచ్చిన క్లెయిమ్స్‌ను పరిశీలించి త్వరితగతిన ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయించి పూర్తి చేయాలని ఆదేశించారు. సీఈఓతో పాటు ఎంఈఓ హేమలత, ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్‌రెడ్డి, హెచ్ఎం భువనేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

పుంగనూరు: రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 10న పుంగనూరు మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. తొలుత 9 గంటలకు కాపాడంమిట్టపల్లెలో హెల్త్ సెంటర్‌ను, ఆరడిగుంట, ఎంసి.పల్లె, చంద్రమాకులపల్లెలో 33 కేవీ సబ్‌స్టేషన్లను, వనమలదిన్నెలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రాగానిపల్లెలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌సెంటర్‌ను, ఏటవాకిలి, మంగళం, ఉలవలదిన్నెలో ఆర్వో ప్లాంట్లను ప్రారంభిస్తారని వివరించారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

11న అభివృద్ధి పనుల ప్రారంభం

రొంపిచెర్ల: ఈ నెల 11న మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి కోరారు. మంత్రి పర్యటనపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రొంపిచెర్లలో రూ.7 కోట్లతో నిర్మించిన మోడల్ స్కూల్, రూ.2 కోట్లతో నిర్మించిన షాదీమహల్‌ను, బండకిందపల్లె, మోటుమల్లెలలో రూ.4 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్లు, చెంచెంరెడ్డిగారిపల్లెలో గ్రామ సచివాలయాన్ని, అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్వో ప్లాంట్లను మంత్రి ప్రారంభిస్తారని వివరించారు. సమావేశంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సర్పంచులు నాగిరెడ్డి, సుధారాణి, జీవలత, హేమలత, నాయకులు కోటా వెంకటరమణ, రామనారాయణరెడ్డి పాల్గొన్నారు.



రొంపిచెర్ల:మాట్లాడుతున్న జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

12న సదుంలో..

సదుం: మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 12న పర్యటించనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు.

గ్రంథాలయ పుస్తకాలతో వ్యక్తిత్వ వికాసం



గ్రంథాలయ పుస్తకాలను చూపుతున్న విద్యార్థినులు

గంగవరం: గ్రంథాలయ పుస్తకాలతో విద్యార్థులు తమ వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడుతో కలిసి విద్యార్థినులకు గ్రంథాలయ పుస్తకాలను శుక్రవారం అందజేసి ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పాఠ్య పుస్తకాలతో పాటు మనిషికి జ్ఞానాన్ని ప్రసాదించే ఇతర పుస్తకాలను సైతం చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల సాహిత్యం జీవిత పాఠాలు నేర్పిస్తాయని, పిల్లలు వారానికి ఒక కథ, పద్యం నేర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలం..రేపటి క్రీడా దివ్వెలం



నేనుగానీ సిక్స్ కొడితే..: టీచర్ బేబి బ్యాట్‌తో ఆడుతూంటే చుట్టూ ఉత్సాహంగా చిన్నారులు

పిల్లలకు ఆటలంటే ఎంతిష్టమో..ఇక్కడ చిత్రం చెప్పకనే చెబుతోంది. ఒక్కొక్కరి ముఖంలో పొంగిపొరలుతున్న ఉత్సాహం, ఆనందం..చూస్తుంటే తెగ ముచ్చటేస్తోంది కదూ! 'మా చిన్నతనంలో మేం కూడా..' అనే లెవెల్లో ఫ్లాష్‌బ్యాక్ జ్ఞాపకాల పుష్ప పరిమళాలను మీరూ ఆస్వాదించేలా పిల్లల భావోద్వేగాలు చూడొచ్చు. ఇక్కడ క్రికెట్ బ్యాట్ పట్టుకున్న ఆమె పేరు బేబి. సోమల ప్రాథమిక పాఠశాలలో టీచర్. శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించిన క్రీడాసామగ్రి పాఠశాలకు చేరడంతో బేబీతోపాటు హెచ్ఎం ఎల్లయ్య, ఉపాధ్యాయులు రామ్మోహన్, వహాబ్‌జాన్, సురేష్, సుదర్శన్ తదితరులు కూడా క్రీడా వస్తువులతో తమకు పరిచయం ఉన్న ఆటలు ఆడి విద్యార్థుల్లో జోష్ నింపారు. - సోమల

'ఆడుదాం ఆంధ్రా' స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

పుంగనూరు : క్రీడల్లో యువతలోని ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలకు శ్రీకారం చుట్టిందని, నియోజకవర్గంలోని యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం వనమలదిన్నెలో 250 యువకులకు 'ఆడుదాం ఆంధ్రా' స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసి చైర్మన్ మాట్లాడారు.



స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న చైర్మన్

తల్లీబిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉండాలి





పుంగనూరు : సంపూర్ణ పోషణ పదార్థాలను పంపిణీ చేస్తున్న అమ్ము, కోనేటిపాళ్యంలో..

పుంగనూరు: తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ కొండవీటి కాంతమ్మ కోరారు. శుక్రవారం పట్టణంలోని యూబి కాంపౌండు అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, గుడ్లు, పప్పు తదితర పోషక పదార్థాలను పంపిణీ చేశారు. అలాగే కోనేటిపాళ్యం అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్లు పూలత్యాగరాజు, కొండవీటి గంగులమ్మ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది సల్మా, ఆయిషా, రాణి ప్రమీల, సునంద, పూజిత పాల్గొన్నారు.

సోమలలో..



సోమల : పాదలగుంటపల్లెలో..

సోమల: గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలని మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు, స్థానిక ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం పాదలగుంటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి ఆయన మాట్లాడారు.

'వైఎస్సార్ కళ్యాణమస్తు' సద్వినియోగం చేసుకోండి



చిచ్చిలివారిపల్లెలో వైఎస్సార్ కళ్యాణమస్తు రశీదును అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: వైఎస్సార్ కళ్యాణమస్తు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీ నిర్వహించారు. ఆరోగ్య హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. వైఎస్సార్ కళ్యాణమస్తు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన మల్లేశ్వరికి కళ్యాణమస్తు పథకం కింద ప్రభుత్వం రూ.50వేలను మంజూరు చేసింది. ఆమె ఖాతాలో సొమ్ము జమ కావడంతో దానికి సంబంధించిన రిసిప్ట్‌ను ఆయన అందజేసి మాట్లాడారు.ఎస్టీ, ఎస్సీలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్టీ, ఎస్సీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50వేలు, కులాంతర వివాహం చేసుకుంటే రూ.75 వేలు, మైనారిటీలకు రూ.లక్ష, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, నిర్మాణ కూలీలకు రూ.40 వేలు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. వివాహాలు చేసుకున్న జంటలు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, రామనారాయణ రెడ్డి, సీవీ. రమణ కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలుకుదాం



బట్ట సంచులను ప్రదర్శిస్తున్న బ్యాంకు, ప్రజాసంఘాల నిర్వాహకులు

పలమనేరు: పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలికి బట్ట సంచులను వాడాలని పలమనేరు పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ మండీసుధా పిలుపునిచ్చారు. చిత్తూరు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ మేనేజర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొరుగునే ఉన్న తమిళనాడులో ప్రతి ఒక్కరూ, గుడ్డ బ్యాగులను వాడుతున్నారని, పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యల కారణంగా ఇప్పటికే వాటి విక్రయాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలనే కృతనిశ్చయం ప్రజల్లో వస్తే ఆశించిన లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి, రిటైర్డ్ ఉద్యోగులు, ఏపీ ఎన్జీవోలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పాలనపై శిక్షణ

రామకుప్పం: గ్రామ పంచాయతీ పరిపాలనపై శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీకి సంబంధించి స్వరూప స్వభావాలు, ఆదాయాలు–వ్యయాలు, ఆడిట్, రికార్డుల నిర్వహణ ఇత్యాది వాటిపై శిక్షణనిచ్చారు. గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ